


పక్కా వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని 42వ డివిజన్ స్వామినగర్ పరిసర ప్రజల రాకపోకలకు పక్కా వంతెన నిర్మించాలని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వామినగర్ ప్రాంతం 2015లో కాకినాడ నగర పాలక సంస్థలో విలీనమైందన్నారు. నగరానికి స్వామినగర్ ప్రాంతానికి తూరల వంతెన నిర్మించి చాలా కాలమైందన్నారు. ప్రస్తుతం వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోక లకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్వామినగర్ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడం వల్ల వంతెనపై రద్దీ పెరిగిందన్నారు. వంతెనకు రెండుపక్కల పారిశుధ్యం లోపించిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన పక్కా వంతెన నిర్మించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ విద్యారంగ రక్షణే ధ్యేయం

- యుటిఎఫ్ ప్రతినిధులు సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్
- 3వ రోజు సాగిన ప్రతినిధుల సభ
- నేడు నూతన కమిటీ ఎన్నిక, పలు తీర్మానాలకు ఆమోదం



మహాసభలో సౌహార్ద సందేశం ఇస్తున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగం రక్షణే ధ్యేయంగా కదలాలని, దీని కోసం అందరూ నడుం బిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పిలుపునిచ్చారు. కాకినాడ పిఆర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలో మంగళవారం మూడోరోజు కొనసాగింది. ఇందులో భాగంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభను నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. భవిష్యత్తు కర్తవ్యాలు గురించి వివరించారు. దేశంలో, రాష్ట్రంలో విద్యారంగం ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడుస్తూ, శరవేగంగా కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ జరుగుతుందన్నారు. ఫలితంగా పేదలకు విద్య దూరమయ్యే ప్రమాద పరిస్థితులు ఏర్పడబోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగాన్ని కాపాడ్డానికి ప్రతి ఉపాధ్యాయుడు నడుం కట్టాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సింగల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో చట్టం చేయకుండా కేంద్రం తెచ్చిపెట్టిన నూతన విద్యా చట్టం-2020 విద్యా వ్యాపారానికి అనువుగా మారిందన్నారు. ప్రభుత్వ బడులను, ఉద్యోగ ఉపాధ్యాయులను పరిరక్షించుకోవడానికి భవిష్యత్తు ఉద్యమాలకు ఉపాధ్యాయుల సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 16వ విద్యా మహాసభల్లో రాష్ట్ర యుటిఎఫ్ సభ్యత్వం 80 వేలు ఉండగా 17వ మహాసభలకు లక్ష పైనే దాటిందని తెలిపారు. యుటిఎఫ్ పట్ల ఉపాధ్యాయులకు ఉండే నిబద్ధతకు ఇది ప్రతీక అన్నారు.



గ్రూపు చర్చల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



ఎంవిఎస్.శర్మ



వి.బాలసుబ్రహ్మణ్యం




కెఎస్ఎస్.ప్రసాద్

ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు చైతన్యవంతమై సమాజానికి దిశా నిర్దేశకులు కావాలన్నారు. సోషల్ మీడియాకు బానిసలు కారాదన్నారు. దేశంలో పలు రకాల శక్తులు తమ పన్నాగాలను పబ్బం గడుపుకోవడానికి రకరకాల కార్యక్రమాలతో ప్రజల మధ్య విద్వేషాలు పెంచి వారి ఆలోచనలు పక్కదోవకు పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. దీన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. దేశ సమగ్రత లౌకిక తత్వం కాపాడుకోవడానికి సాయిశక్తులా కషి చేయాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులు సమైక్యంగా ఉండాలన్నారు. పిల్లలను సాంకేతిక దృక్పథంవైపు నడిపించాలన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి సంఘం ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను ఎన్.కుమార్‌రాజా, ఆడిట్ కమిటీ నివేదికను రాష్ట్ర కమిటీ అధ్యక్షులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ నివేదికను అధ్యక్షులు ఎం.హనుమంతరావు, మహిళా కమిటీ నివేదికను ఎఎన్.కుసుమకుమారి, రాష్ట్ర యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను ఎస్‌పి.మనోహర్ కుమార్ ప్రవేశపెట్టారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత ఇటీవల మరణించిన పలువురు ప్రముఖులకు సభ్యులు నివాళులర్పించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లోనూ, యుటిఎఫ్ అకాడమిక్ అంశాల్లోనూ ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలను అందించారు. సభలో పాల్గొన్న ముఖ్య అతిథిలకు జ్ఞాపికలు అందించారు. అనంతరం జిల్లాల వారీగా సమీక్ష జరిగింది. సాయంత్రం యుటిఎఫ్ సాంస్కృతిక దళం ఆలపించిన విప్లవ గీతాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, వి.శ్రీలక్ష్మి, బి.సుభాషిణి, ఎస్.కిషోర్ కుమార్, రెడ్డి మోహన్‌రావు, టి.అన్నారాం, ఎస్.జ్యోతిబసు, కాకినాడ జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరేష్, పి.చక్రవర్తి, యుటిఎఫ్ కృషి రాష్ట్ర పత్రికా బాధ్యులు ఐ.ప్రసాదరావు, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులతోనే సమాజంలో మార్పు : కలెక్టర్

సమాజంలో ఏదైనా మార్పు రావాలంటే అది గురువుల ద్వారా మాత్రమే సాధ్యమని కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి సౌహార్ద సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయులంతా కూడా సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తన తల్లిదండ్రులు కూడా కడప జిల్లాలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గురువులు తమ వత్తి ద్వారా గౌరవాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు యుటిఎఫ్ తరుపున ఆయనకు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. తరువాత యుటిఎఫ్ సంక్షేమ పథకం బాండ్‌ను ప్రారంభించారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు

సిపిఎం నేత రాఘవమ్మ ఇకలేరు...

పలువురి నాయకుల సంతాపం

ప్రజాశక్తి-అమలాపురం, అయినవిల్లి



సిపిఎం నాయకురాలు కుడిపూడి రాఘవమ్మ (72) ఇకలేరు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడిలో కన్నుమూశారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన తొత్తరమూడిలో బుధవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. రాఘవమ్మ మృతికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాఘవమ్మ మరణం ఉద్యమాలకు తీరని లోటన్నారు. వ్యవసాయ కూలీ పోరాటాలు, మద్యపాన వ్యతిరేక పోరాటాల్లో రాఘవమ్మ క్రియా శీలకంగా పనిచేశారని కొనియాడారు. పార్టీ, ప్రజా సంఘాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారని తెలిపారు. అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన రాఘవమ్మకు భర్త ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు. భర్త కుడుపూడి నరసింహమూర్తి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన గతంలోనే మరణించారు. ఆయన సిపిఎంలో క్రియాశీలకంగా పని చేశారు. ఆయన ప్రోత్సాహంతో రాఘవమ్మ ప్రజా ఉద్యమాల్లో కి వచ్చారు. భర్త మరణం అనంతరం కూడా ఆమె పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1990లో కోనసీమలో ఉవ్వెత్తున జరిగిన కూలీ పోరాటాలు, భూస్వామ్య వ్యతిక పోరాటాల్లో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. వెంకటాయపాలెంలో శిరోముండనం ఘటనలో ఆమె ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. రాఘవమ్మ మృతికి వ్యవసాయ కార్మిక సంఘం అఖిల బారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, అంద్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చల్లా రవికుమార్, డివి.రాఘవులు, ఎన్.బలరాం, జి.దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, డి.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామ్మూర్తి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సురేంద్ర, ఎంటివి.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ కో కన్వీనర్ కె.ప్రణీత్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి, కార్యదర్శి మలకా సుభాషిణి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, కోశాధికారి పి.అమూల్య తదితరులు సంతాపం తెలిపారు.

సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - సామర్లకోట



విజేతలకు బహుమతులు అందిస్తున్న సిఐ కృష్ణభగవాన్

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సిఐ కృష్ణభగవాన్ అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. తొలుత విద్యార్థులకు రంగ వల్లుల పోటీలను సిఐ కృష్ణభగవాన్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, వార్డు కౌన్సిలర్ బలుసు వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగివుండాలన్నారు. పోలీస్ శాఖ ఆదేశాలతో వార్డ్ కౌన్సిలర్ బలుసు వాసు చొరవతో సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు. అనంతరం రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, ఆసుపత్రి అభివృద్ధి కమిటి మాజీ ఛైర్మన్ అడబాల కుమారస్వామి, టిడిపి క్రీడా విభాగ కన్వీనర్ నిమ్మకాయల కిరణ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పర్యటనా ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - పిఠాపురం, గొల్లప్రోలు



పిఠాపురంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్‌ఎ కొణిదల పవన్‌కళ్యాణ్ పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మంగళవారం పరిశీలించారు. పిఠాపురం మండలంలోని మల్లం గ్రామంలోని గోకులం, విరవాడ, పట్టణంలోని ఆర్ఆర్‌బిహెచ్ఆర్ జూనియర్ కళాశాల, పురపాలక ఉన్నత పాఠశాల మైదానం, కుమారపురం గోకులాలను పరిశీలించారు. ఈ పర్యటనలో జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డిపిఒ వి.రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు. గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు జడ్‌పి ప్రాథమిక ప్రభుత్వ కళాశాల ప్రాంగణాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న రెవెన్యూ కార్యాలయాన్ని, అర్బన్ హెల్త్ సెంటర్, తాడిపత్రిలోని బోరువెల్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు పారదర్శకంగా జరగాలని, అర్బన్ హెల్త్ సెంటర్‌కు రంగులు కూడా వేయాలన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కెవి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న. మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, డిఇ గంగరాజు, ఎఇ సురేంద్ర, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితునికి ముదునూరి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు




బాధితునికి చెక్కును ఇస్తున్న ముదునూరి

మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు కొట్నాల మధు ఇటీవల ఒక ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సమాచారాన్ని అందుకున్న వైసిపి నాయకుడు, ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు మంగళవారం బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తరుపున బాధితునికి రూ.5 వేలు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నానిపల్లి చంటి, నాయకులు కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా సుదర్శనం

ప్రజాశక్తి - పెద్దాపురం



నియామక పత్రాన్ని అందిస్తున్న పళ్లంరాజు

కాంగ్రెస్ పార్టీ పెద్దాపురం రూరల్ మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా వాలు తిమ్మాపురం గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది చిలకపాటి సుదర్శనం నియమితులయ్యారు. మంగళవారం కాకినాడ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి ఎంఎం. పల్లంరాజు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ తుమ్మల దొరబాబు, తోట కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి వర్ధన పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం



పాఠశాలను సందర్శించిన ప్రత్యేక తనిఖీ బృందం

మండలంలోని పులిమేరులో ఉన్న శాంతి వర్ధన వికలాంగ బాలల ఆశ్రమ పాఠశాలను మంగళవారం జూనియర్ జస్టిస్ యాక్ట్ బృందం తనిఖీ చేసింది. జువైనల్ జస్టిస్ యాక్ట్-2015 ప్రకారం బాలలతో నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలను తనిఖీ చేయడంలో భాగంగా డిపిఒ చంద్రశేఖర్, డిసిపిఒ సిహెచ్. వెంకట్రావు, సిడిపిఒ జి.ఉష, ఎల్‌సిపిఒ ఎం.సుధా కర్, పిఒఐసి కె.శ్రీనివాస్ పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలు, వంటశాల, మరుగుదొడ్లు, గదులు, ఆహార పదార్థాలతోపాటు, బోధనా విధానాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు అనుగు ణంగా నిర్వహిస్తున్నారని, బాలలకు అన్ని సదు పాయాలు కల్పిస్తున్నారని అన్నారు. ఈ పరిశీల నలో పాఠశాల ఫౌండర్ రాయవరపు వీరబాబు, సత్యవేణి, ఎఒ వేణుగోపాల్, బాబి పాల్గొన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్‌పి

ప్రజాశక్తి - పిఠాపురం



రికార్డులను తనిఖీలు చేస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

సంక్రాంతి పండుగను పరష్కరించుకుని కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. విచారణ దశలో 160 కేసులు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక పోలీస్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు, స్పెషల్ డ్రైవ్‌లు, ప్రత్యేక తనిఖీలు ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు, కోడి పందాలు, గుండాట వంటివి జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వాటిపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గ్రామ పెద్ద సహకారంతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించి జుదాలు నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షునిగా పైడ్రాజు ?


ప్రజాశక్తి - రౌతులపూడి



పైలా పైడ్రాజు

రౌతులపూడి సొసైటీ అధ్యక్ష పదవి కోసం పలువురు ఆశావహులు ఎదురుచూశారు. ఆఖరికి బలరామపురం మాజీ సర్పంచ్ పైలా పైడ్రాజుకే ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆమోద ముద్ర వేసినట్లు తెలుస్తోంది. గత 30 ఏళ్లుగా టిడిపిలో కొనసాగుతున్న ఆయన పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే సొసైటీ అధ్యక్ష పదవి కోసం ఎస్ పైడిపాల మాజీ సర్పంచ్ గొల్లు లక్ష్మణ మూర్తి, పి.రామవరం గ్రామానికి చెందిన సింహాద్రి పెదబాబు, పైలా పైడ్రాజు ఆశించారు. వీరి పేర్లను కొద్ది రోజులుగా ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ టిడిపి నేతలతో చర్చించారు. ఆఖరికి బిసి కోటాలో పైలా పైడ్రాజుకు సొసైటీ అధ్యక్ష పదవిని కట్టబట్టేందుకు ఎంఎల్ఎ మొగ్గుచూపారని, ఒకటి రెండు రోజుల్లోనే పైడ్రాజు పేరును ఎంఎల్ఎ ప్రకటిస్తారని టిడిపి నేతల ద్వారా తెలిసింది.

కార్టూ'నిజం'



రసాభాసగా సామాజిక తనిఖీ సభ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



వాదులాడుకుంటున్న టిడిపికి చెందిన రెండు గ్రూపులు

మండలంలోని లంపకలోవ గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ సభ రసాభాసగా మారింది. మంగళవారం గ్రామ సర్పంచ్ పంది మణికుమారి అధ్యక్షతన డిఆర్‌పి శ్రీరామమూర్తి గ్రామసభను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.40 లక్షలతో 30 పనులు, పంచాయతీ రాజ్ నిధులు రూ.8.19 లక్షలతో జరిగిన పనులపై ఈనెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ఆడిట్ బృందం తనిఖీ చేసిందని తెలిపారు. కర్రి వాని చెరువు పనుల్లో రూ.31 వేలు అదనంగా వేతనాలు చెల్లించారని, మొత్తం 576 మస్తరు కాగితాలు ఉపయోగించగా, మస్తర్లలో దిద్దుబాట్లు, ఒకరి కంటే ఎక్కువ మందికి ఒకరే వేలుముద్రలు వేసినట్టు గుర్తించినట్లు తెలిపారు. చేసిన పనులకు సంభందించి ఒక్కటి కూడా శిలాఫలకాలు ఏర్పాటు చేయలేదని, కొబ్బరి మొక్కల పెంపకంలో రూ.23 వేలు దుర్వినియోగమైనట్టు గుర్తించినట్లు తెలిపారు. ఉపాధి పనులకు పంచాయతీ తీర్మానాలు లేవని ప్రతీ 3వ శుక్రవారం నిర్వహించాల్సిన సమావేశాలు జరగలేదని, పూర్తి స్థాయిలో రిజిస్టర్ల నిర్వాహణ జరగలేదని ఆయన వివరించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై సర్పంచ్ పంది మణికుమారి, స్థానికులు చక్కపల్లి బూరయ్య, సమ్మిటి అమ్మిరాజు, చక్కపల్లి మందేశ్వరరావు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో టిడిపిలోని రెండు గ్రూపులకు చెందిన వారు ఒకరిపై వాదోపవాదనలకు దిగారు. దీంతో ఎస్ఐ లక్ష్మీకాంతం జోక్యం చేసుకుని ఇరువర్గాలను వారించారు. ఈ సమావేశంలో కార్యదర్శి బి.వీరబాబు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు

53వ రోజుకు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారం నాటికి 53వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 53 రోజులుగా కార్మికులు ఆకలితో అలమటిస్తూ అనేక రూపాల్లో తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కానీ ప్రజాప్రతినిధుల్లో కాని, ప్రభుత్వం నుంచి కానీ ఏమాత్రం స్పందన రాకపోవడం బాధాకరమని అన్నారు.కార్మిక సమస్యలను పరిష్కరించలేమని యాజమాన్యం మొండికేయడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం కల్పించుకుని ఫ్యాక్టరీని తెరిపించి 409 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. అప్పటి వరకూ తమ ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ను హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్‌ను అతిదారుణంగా హత్య చేసిన హంతకులకు ఉరిశిక్ష విధించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. రూ.120 కోట్ల విలువ చేసే రోడ్ల ప్రాజెక్టులో జరిగిన భారీ స్కామ్‌ను ఆయన వెలుగులోకి తెచ్చారని అన్నారు. ఇందుకు సంబంధించిన కాంట్రాక్టర్ కొంత మందితో కలిసి జర్నలిస్టును అత్యంత పాశవికంగా హత్య చేశారని అన్నారు. నిందుతులను కఠినంగా శిక్షించడంతోపాటు, జర్నలిస్ట్ కుటుంబానికి రూ.1 కోటి ప్రభుత్వం ఇచ్చి అండగా నిలవాలని కోరారు.

పనుల కల్పనపై ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పనులు, వేతనాలు కల్పన తదితర అంశాలపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమం జరిగింది. విజయవాడ కమిషనర్ కార్యాలయం నుంచి ఉపాధి పనులు గుర్తింపునకు తీసుకోవల్సిన విధానాలు, చెరువులు, కాలువలు, హార్టికల్చర్‌కు సంబంధించిన పనులు గుర్తింపు, ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 తగ్గకుండా పనుల కల్పన, చేసిన పనులకు సంబంధించి కొలతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీలలిత మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎపిడి ఎం.భానుప్రకాష్, ఎపిఒ సుధీర్, జెఇ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొబ్బర్లంకకు చెందిన జెట్టం జ్యోతిర్మయికి మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఏడాది తరువాత వారు విడిపోయి విడాకులు తీసుకున్నారు. బొబ్బర్లంకలో ఉంటూ ధవళేశ్వరంలో కుట్టు మిషన్ నేర్చుకోవడానికి వెళుతోంది. ఈ నెల 5న ఉదయం ధవళేశ్వరం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో జ్యోతిర్మయి సోదరుడు సతీష్ కుమార్ పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలో పలు పేకాట శిబిరాలపై రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండలం కూళ్లలో సోమవారం రాత్రి జరిగిన యువకుని హత్య కేసు వివరాలను ఎస్ఐ జానీ బాషా వెల్లడించారు. గ్రామానికి చెందిన సత్తి సువర్ణరత్నం, మంచాల వెంకట సూర్యారావు స్నేహితులని, సువర్ణ రత్నంకు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందని సూర్యారావు అనుమానించాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రత్నంను మందు పార్టీ చేసుకుందామని పిలిచాడు. అధిక మొత్తంలో మద్యం సేవించడంతో అతడు స్పృహ కోల్పోయాడు. సూర్యారావు బీరు బాటిల్ పగలగొట్టి రత్నం గొంతు వద్ద గాయం చేశాడు. అయినా ప్రాణం ఉందని గమనించి పక్కనే ఉన్న కాలువలో పడుకోబెట్టి మట్టిలో కూరుకుపోయేలా తొక్కడంతో రత్నం మృతి చెందాడు. మృతుని అన్న సత్తి ఆనంద్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..కొత్తపల్లి గ్రామానికి చెందిన అడపా సూరిబాబు ఉప్పాడ - పిఠాపురం ప్రధాన రహదారి సమీపంలో ఉన్న తన ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా మరో ద్విచక్రవాహనదారుడు వేగంగా ఢీకొట్టాడు. దీంతో సూరిబాబు తలకు తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు కొత్తపల్లి పిహెచ్సికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రుడిని కాకినాడకు తరలించారు.

మద్యం వాహనానికి ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-పిఠాపురం రోడ్డులో మద్యంతో వెళ్తున్న వాహనాన్ని మరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మద్యం కేసులు పగిలిపోయాయి. డ్రైవర్కు గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట ఐఎంఎల్ డిపో నుంచి మద్యం కేసులతో డి.పోలవరం వెళుతున్న వాహనాన్ని పిఠాపురం వైపు నుంచి వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మద్యం కేసులు పెద్ద ఎత్తున పగిలిపోయాయి. వాహన డ్రైవర్కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పొగాకు బేరన్లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామయ్యపాలెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పొగాకు బేరన్లో అగ్ని ప్రమాదం జరిగింది. రామయ్యపాలెం గ్రామానికి చెందిన గొల్లవిల్లి బాబురావుకు చెందిన పొగాకు బేరన్లో అగ్ని ప్రమాదానికి గురియింది. బేరన్లో సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే పొగాకు ఉందని రైతు తెలిపారు. పొగాకుతోపాటు, బేరన్ కూడా పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను ఆర్పేందుకు కూలీలు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటీనా అగ్నిమాపక యంత్రాంగం వచ్చి మంటలను అదుపు చేసిన ఫలితం లేకుండా పోయింది. అప్పటికే పొగాకుతోపాటు, బేరన్ కూడా పూర్తిగా కాలిపోయిందని రైతు బాబూరావు కన్నీరుమున్నీరు అయ్యారు.

యానాం చేరుకున్న పుదుచ్చేరి గవర్నర్

ప్రజాశక్తి - యానాం

యానాంలో బుధవారం ముగిసే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలో పాల్గొనేందుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాథన్ మంగళవారం రాత్రి యానాం చేరుకున్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద ఆయనకు పరిపాలనాధికారి మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కందవల్లి రామకృష్ణ, ఎస్పి రాజశేఖరన్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - కరప

స్థానిక జడ్పి ఉన్నత పాఠశాల క్రీడ ప్రాంగణంలో మంగళవారం హైస్కూల్ పూర్వ విద్యార్థులు రూ.37 వేలు విలువచేసే క్రికెట్ కిట్లను వివిధ జట్లకు అందజేశారు. స్థానిక మెరక వీధి క్రికెట్ జట్టుకు, పేపకాయలపాలెం జట్టు, కరప ఫ్రెండ్స్ క్రికెట్ జట్టుకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి తాతీలు, టోర్నమెంట్ నిర్వాహకులు నక్క సత్తిబాబు, దేవు శివ, పేకేటి దుర్గాప్రసాద్, పోలిశెట్టి వెంకట రమణారావు, పేపకాయల తణుకులరాజు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - కాకినాడ



ఉద్యోగాలు సాధించిన ఆదిత్య విద్యార్థులు

యాక్సెంచర్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలలకు చెందిన 141 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి తెలిపారు. కంపెనీ ఏదైనా ఉద్యోగ సాధనలో ఆదిత్య విద్యార్థులు ముందుంటారని అన్నారు. డిగ్రీ ప్రారంభం నుంచే విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్మెంట్, సాఫ్ట్ స్కిల్స్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉద్యోగం కావాలంటే ఆదిత్య' అనే విద్యార్థుల, తల్లిదండ్రుల కలను నెరవేరుస్తూ ఆదిత్య డిగ్రీ కళాశాల ముందుకు సాగుతున్నాయని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు అన్నారు. ఉద్యోగాలు సాధించిన 141 మంది విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపక బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, ప్రిన్సిపల్స్ కె.కరుణ, డి.బ్యూలా, ఎండి.షాహిద్దిన్, సిహెచ్.ఫణి కుమార్, షేక్ రెహమాన్, డి.రామకృష్ణ, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్స్ వివిఎస్ఎన్.కుమార్, కిషోర్ అభినందించారు.

మండల బడ్జెట్కు పాలకవర్గం ఆమోదం

ప్రజాశక్తి - కరప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీలక్ష్మి

మండల బడ్జెట్ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. మంగళవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎంపిపి శ్రీలక్ష్మి వివరించారు. ప్రస్తుతం రూ.3.92 కోట్లతో సిసి రోడ్లు, డ్రెయిన్లు, పశువుల షెడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కార్యాలయం సూపరింటెండెంట్ బిఎల్ నరసింహం మండల ప్రజా పరిషత్ 2024-25 సంవత్సర బడ్జెట్ను సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ను సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిడిఒ ఎం.అనుపమ, తహశీల్దార్ ఎం.సత్యనారాయణ, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ వర్ధన్, ఎఇ రమేష్, ఎలక్ట్రికల్ ఎఇ ఈశ్వర్ప్రసాద్, వేలంగి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ఆర్డిఒకు వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాత్కాలిక పద్ధతిలో రేషన్ డీలర్లుగా ఉన్న తమకు న్యాయం చేయాలని పలువురు ఆర్డిఒను కోరారు. మండలంలోని చొల్లంగి, తాళ్ళరేవు, పటవల, కోరంగి గ్రామాలకు చెందిన డీలర్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, వైదాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాకినాడ ఆర్డిఒకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2016లో రేషన్షాపుల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో తమను తాత్కాలిక డీలర్లుగా అప్పటి ఆర్డిఒ నియమించారని తెలిపారు. అప్పటి నుంచి పర్మినెంట్ డీలర్లగా నియమించాలని కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నామని అన్నారు. అయితే తాము నిర్వహిస్తున్న షాపులకు నోటిఫికేషన్ ఇవ్వడం, వీటికి రిజర్వేషన్ల ద్వారా కేటాయింపులు చేయడం వల్ల తాము అన్యాయానికి గురౌతున్నామని అన్నారు. ప్రస్తుత నిర్ణయంతో తమ కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా రేషన్ షాపులకు పర్మినెంట్ డీలర్లుగా తమను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డిఒను వారు కోరారు. ఆర్డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వారిలో అరిగెల మాధవి, భజన నవ్య, రచ్చ రాజశేఖర్, మేడిశెట్టి లోవరాజు, సంగాడి లక్ష్మిపూర్ణిమ, మేడిశెట్టి నాగ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నష్ట పరిహారం కోసం మహిళల ధర్నా

ప్రజాశక్తి - గొల్లప్రోలు


కళాశాల వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

మండలంలో చేబ్రోలు ఆదర్శ్ కళాశాల వద్ద మంగళవారం మహిళలు ధర్నాకు దిగారు. 2 నెలల క్రితం చెందుర్తి గ్రామానికి మహిళలు జీడి పిక్కల ఫ్యాక్టరీలో పని ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో సంబంధిత కళాశాల బస్సు ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చెందుర్తి గ్రామానికి చెందిన పిల్ల దేవి, పిల్ల వెంకటలక్ష్మి, అంజూరి గంగాభవానీలు గాయాలపాలయ్యారు. అయితే కేసు లేకుండా చేస్తే నష్ట పరిహారం ఇస్తామని అప్పట్లో యాజమాన్యం వారికి హామీ ఇచ్చింది. తరువాత వారిని కళాశాల యాజమాన్యం పట్టించుకోలేదంటూ మంగళవారం సంబంధిత కార్మికులతో కలిసి పలువురు మహిళలు కళాశాల గేటు వద్ద ధర్నాకు దిగారు. దీంతో కళాశాల కరస్పాండెంట్ బుర్ర అనుబాబు వారితో చర్చలు నిర్వహించారు. సంఘటన ప్రాంతానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం


కేక్ కట్ చేస్తున్న నాని, పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

టిడిపి నాయకులు, గుడా మాజీ డైరెక్టర్ ఎలిసెట్టి నాని పుట్టినరోజు వేడుకల సందర్భంగా మండలంలోని కాండ్రకోట గ్రామంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. నాని యూత్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు. డాక్టర్లు జగదీష్ బాబు, అనీష్ నందన్, రుక్మిణి, సంజన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే పెద్దాపురం కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 65 మందిని కళ్ళజోళ్ళకు ఎంపిక చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదాతలు పాల్గొన్నారు. తొలుత ఎలిశెట్టి నాని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నిమ్మకాయల రంగనాగ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

స్థానిక మెయిన్ రోడ్లో డొక్కా సీతమ్మ క్యాంటీన్లో జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో గత ఎన్నికల అనంతరం నుంచి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఆకలి అని అడిగిన వాళ్లకు లేదు అనకుండా డొక్క సీతమ్మ అన్నం పెట్టారని, ఆమెను స్ఫూర్తిగా తీసుకున్న తమ అధినేత పవన్కళ్యాణ్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, తుమ్మల పనింద్ర, తుమ్మల మనోజ్, గంధం శ్రీనివాస్, మొగిలి గంగాధర్, సత్తి సోమరాజు, గాది అప్పన్న పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - తొండంగి

నిరక్షరాస్యలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రాజేశ్వరరావు అధ్యక్షతన వాలంటీర్లకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఉల్లాస నూతన పథకం ద్వారా ప్రతి వాలంటీర్ ఆయా గ్రామాల్లో పదిమంది నిరక్షరాస్యులను దత్తత తీసుకుని వారికి చదవడం, రాయడం నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా పుస్తకాలను వాలంటీర్లుగా పనిచేసే ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుపిఆర్డి మార్కండేయరావు, ఎపిఎం వై.సత్తిబాబు, విజయలక్ష్మి, బేబీ సత్యవాణి, అన్నపూర్ణ మండల సమాఖ్య సభ్యులు బి.చంటమ్మ, కె.బేబీ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పెంపొందుతుందని సిఐ బి.సూరిఅప్పారావు అన్నారు. సంక్రాంతిని పురష్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన క్రీడోత్సవాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కోడిపందాలు, గుండాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కుటుంబాలతో పండగను ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సాంప్రదాయ క్రీడల ద్వారా యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పింద్రాల శ్రీను, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మాజీ జడ్పిటిసి జ్యోతుల పెద్దబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్ జొన్నాడ వీరబాబు, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సూరిబాబురాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - పెద్దాపురం


శుభాకాంక్షలు తెలియచేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

మున్సిపల్ మాజీ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్గా సూరిబాబు రాజు పట్టణ అభివృద్ధికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు రంగనాగ్, అడబాల కుమారస్వామి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీష్ మోహన్, పాలకుర్తి శ్రీనుబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులుపాల్గొన్నారు.

పుంత రోడ్డుకు మోక్షం... రైతుల్లో హర్షం

ప్రజాశక్తి - కోటనందూరు


సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

అల్లిపూడి గ్రామ పుంతరోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత కొంత కాలం నుంచి పుంత రోడ్డు ద్వారా పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పుంతరోడ్డు అధ్వానంగా ఉండటంతో రైతులు తాండవ రిజర్వాయర్ కాలువను దాటుకుని పంట పొలాల్లోకి వెళ్లే పరిస్థితి ఉండేది. రైతుల ఇబ్బందులను టిడిపి నాయకుడు అంకంరెడ్డి బుల్లిబాబు ఎంఎల్ఎ యనమల దివ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఆదేశాలతో మంగళవారం తహశీల్దార్ టి.సుభాష్ అల్లిపూడి గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. నూకాలమ్మ తల్లి పుంత రోడ్డును నిర్మించాలని రైతులు కోరారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రైతుల కోరిక మేరకు రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలవ ప్రెసిడెంట్లు రూత్తల సత్య సీతయ్య, సురేష్కుమార్, అంకమ్మరెడ్డి గోపి, భక్తి బుజ్జి, రైతులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరఫీ కేంద్రాన్ని ఎంఇఒ విఆర్కె.చౌదరి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక వైకల్యం ఉన్న బాలలకు ఈ ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైకల్యం ఉన్న బాలల తల్లిదండ్రులు ఈ ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పరిధిలోని వైకల్యం ఉన్న బాలల అందరికీ ఈ ఫిజియోథెరపీ సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎల్.శివజ్యోతి, ఫిజియోథెరిస్టు డాక్టర్ అపర్ణ, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్రెడ్డి పాల్గొన్నారు.

ఆక్వా సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగి పంచాయతీ కార్యాలయం వద్ద ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు రొయ్యల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సైంటిస్ట్, కాకినాడ కేంద్ర ఇన్ఛార్జ్ డాక్టర్ మురళీ పి అందె ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపెడా జెటిఒ డాక్టర్ బంగారమ్మ, ఎడిఎఫ్ ఎం.లావణ్య రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆక్వా కల్చర్ లో ఫీడ్ మినరల్స్, ప్రో బయోటిక్స్ లను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ సైంటిస్ట్ కె.శ్యామల, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ ఎం .ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడల పోటీలు

ప్రజాశక్తి - జగ్గంపేట


విజేతలతో పోలీసు అధికారులు

ఈ నెల 2 నుంచి పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ సాంప్రదాయ క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు ప్రధానం చేశారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆవరణంలో రంగవల్లులతో ముగ్గులు వేసి భోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బాలికల కబడ్డీ పోటీల్లో జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. సీనియర్ వాలీబాల్ పోటీలో ఇర్రిపాక జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వీరికి ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సతీమణి మణి, జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్ఛార్జ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఐసిడిఎస్ సిడిపిఒ పూర్ణిమ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, టిడిపి నాయకులు ఎస్విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, డిఎస్పి శ్రీహరిరాజు, సిఐ వైఆర్కె.శ్రీనివాస్, జగ్గంపేట, గండేపల్లి ఎస్ఐలు రఘునాథరావు, యువి.శివనాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాడుదాం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

అధికార పార్టీ పెట్టే కేసులకు భయ పడకుండా ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాడుదామని వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో పలువురు ఎంపిటిసి సభ్యులు ఆయనను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలు లేకుండా చూడవలసిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. తక్షణమే ఎంపిటిసి సభ్యుడు కాశీకి న్యాయం జరిగేలా ఉన్నతాధికారులతో మాట్లాడుతానని అన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంకు శ్రీను, దొరబాబు, చిన్న, చక్రధర్ పాల్గొన్నారు.

జిజిహెచ్లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కాకినాడ జిజిహెచ్లో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ బాధితుల కోసం 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు నోడల్ అధికారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, కమ్యూనిటీ మెడిసిన్, పల్మనాలజీ, మైక్రో బయాలజీ హెచ్ఒడిలతో నిపుణుల బృందాన్ని నియమించినట్లు చెప్పారు. ఆక్సిజన్, ఇతర మందులు అవసరాల నిమిత్తం నిపుణులతో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు ఈ వైరస్ గురించి తెలియజేయుటలో భాగంగా చేయవలసినవి, చేయకూడని పనుల గురించి ఫ్లెక్సీలను ఆసుపత్రిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ వైరస్ సాధారణంగా చిన్న పిల్లలు, వృద్ధులకు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరు తగు చర్యలు పాటించి జ్వరము, తలనొప్పి, జలుబు వంటివి కలిగినప్పుడు ఐసోలేషన్లో ఉండాలని ఆయన కోరారు.

రీ సర్వేపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు గ్రామంలో మంగళవారం రీ సర్వేపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి కట్టమూరు గ్రామంలో రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులకు సంబంధించిన భూముల కొలతలతో రికార్డులు రూపొందిస్తారన్నారు. గతంలో రీ సర్వే జరగని గ్రామాల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో జిల్లా సర్వేయర్ కె.శ్రీనివాస్, డివిజనల్ సర్వేయర్ అంబికాలమ్మ, మండల సర్వేయర్ సామేరు, విఆర్ఒలు నండూరి ప్రసాదరావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఒజెటితో నైపుణ్యత పెంపు

ప్రజాశక్తి - పిఠాపురం

తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలతో పాటు ఆన్ జాబ్ ట్రైనింగ్(ఒజెటి) వల్ల విద్యార్థుల్లో నైపుణ్యత పెరుగుతుందని ఆర్ఆర్బిహెచ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు అన్నారు. మంగళవారం కళాశాలలో సెరికల్చర్ గ్రూపు విద్యార్థులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత డిసెంబర్ రెండో తేదీ నుంచి ఒజెటి నిర్వహించామన్నారు. మల్బారి కటింగ్స్, నర్సరీ బెడ్ల తయారీ, పట్టు దారం నాణ్యత, లోపాలను చూడడం, చీరలు తయారీ వంటి వాటిపై సమగ్ర అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

యానాం వార్తలు


సమావేశంలో మాట్లాడుతున్న రీజెన్సీ ఛైర్మన్ నాయుడు

ప్రజలు సహకరిస్తే పరిశ్రమ పునరుద్ధరణ

రీజెన్సీ వ్యవస్థాపక ఛైర్మన్ నాయుడు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలు సహకరిస్తే రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ పునరుద్ధరణ సాధ్యపడుతుందని రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జివిఎన్.నాయుడు అన్నారు. మంగళవారం రీజెన్సీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం ప్రజలతో సుమారు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రీజెన్సీ అంటే యానాం, యానాం అంటే రీజెన్సీ అనేంతగా ప్రజలతో మమేకం అయ్యామన్నారు. రీజెన్సీ తిరిగి ప్రారంభమైతే వేలాది కుటుంబాలకు అన్నివిధాలా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. యానాంకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ఇప్పటికీ తపన పడుతున్నానని, అయితే ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రీజెన్సీ ముందుకు వెళ్లకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలను ఖండించాలన్నారు. రీజెన్సీ కోసం ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రంగసామి స్వయంగా భరోసా ఇచ్చారని అన్నారు. సిఎం హామీతో కోట్లాది రూపాయలను పెట్టుబడి పరిశ్రమలో ఉత్పత్తికి సన్నహాలు చేశామని తెలిపారు. రీజెన్సీ పరంగా ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా బకాయి లేమన్నారు. రీజెన్సీ టైల్స్ ఉత్పత్తి కోసం సహజ వాయువు సరఫరా కోసం కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని, దీని కోసం సిఎం రంగసామి ప్రభుత్వపరంగా కేంద్రానికి నివేదిక పంపారని వివరించారు. కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు అందరూ సహకరించాలని అన్నారు. రీజెన్సీ రాకతో యానాం వచ్చే రోజుల్లో అన్ని రంగాల్లో మరింత ప్రగతిబాట పట్టగలదని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి పారిశ్రామికాభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నారని, వారిబాటలో పుదుచ్చేరి ప్రభుత్వం పయనించేలా నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజా ఉత్సవాల్లో రీజెన్సీ సంస్థపై మల్లాడి కృష్ణారావు చేసిన అభియోగాల అర్థరహితమని అన్నారు. సహజవాయువు సరఫరా అంశం ఒక కొలిక్కి వస్తే రీజెన్సీ పున్నరుద్ధరణకు మార్గం సుగమం కాగలదని, సానుకూల దృక్పథంతో అందరూ రీజెన్సీకి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

రైతులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పలువురు రైతులకు చెక్కులు, మిల్క్ మిషన్లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తగిన కృషి చేస్తానని అన్నారు. యానాంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ లతామంగేష్కర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.కౌమరన్, గీదా పండు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.